

నాలుగో రోజు రిలే దీక్షలో పాల్గొన్న రైతులు

## నాలుగో రోజుకు రిలే దీక్షలు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 15 : దుద్యాల మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా హకీంపేట చౌరస్తాలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఫార్మా కంపెనీల కోసం సాగు భూములను ప్రభుత్వం తీసుకోవడాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల పరిధిలో సుమారు 13 వందల ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో రైతులు గత కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. తాజాగా ఈ నెల 12న రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. బాధిత గ్రామాలకు చెందిన రైతులు రోజూ కొంతమంది దీక్షల్లో పాల్గొంటున్నారు. ఫార్మా కంపెనీల కోసం భూములిచ్చేది లేదని రైతులు తేల్చి చెబుతున్నారు.






### రూ.29 లక్షలకు మై హోం భూజా లడ్డూ..

నాలెడ్జ్ సిటీలోని మై హోం భూజా గేటెడ్ కమ్యూనిటీలో వినాయకుడి లడ్డూ ఈ ఏడాది రికార్డు స్థాయిలో రూ.29 లక్షలకు అమ్ముడుపోయింది. ఖమ్మం జిల్లా ఇల్లందుకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండపల్లి గణేశ్, సరిత దంపతులు కమ్యూనిటీలో నిర్వహించిన వేలంలో సొంతం చేసుకున్నారు. – కొండాపూర్, సెప్టెంబర్ 15



### మాతృశ్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

మాదాపూర్ డివిజన్ మాతృశ్రీ నగర్ కాలనీలోని మాతృశ్రీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపంలో వినాయక లడ్డూ వేలం పాటలో రూ.6.40 లక్షలకు శ్రీవెన్ ఫార్మా డైరెక్టర్ రుద్రరాజు సూర్యనారాయణ రాజు లడ్డూను కైవసం చేసుకున్నారు. – మాదాపూర్, సెప్టెంబర్ 15



### ఫ్రెండ్స్ వినాయకుడి లడ్డూ@రూ.3.15 లక్షలు

ప్రశాంత్‌నగర్‌లోని ఫ్రెండ్స్ గణేశ్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.3.15 లక్షలు పలికింది. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం వేలం పాట నిర్వహించారు. పూజలందుకున్న వినాయకుడి లడ్డూకు వేలం హోరాహోరీగా జరిగింది. చివరకు కాలనీకి చెందిన జుంగిపల్లి సాకేత్‌రాజ్ రూ.3.15 లక్షలకు లడ్డూను దక్కించుకున్నాడు.
– వనస్థలిపురం, సెప్టెంబర్ 15




వెస్ట్ మారేడ్‌పల్లిలోని గురుస్వామి సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జేఎన్‌యూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో దివంగత సీపీఎం నేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోదండ రామ్, జేఎన్‌యూ పూర్వ విద్యార్థులు పాల్గొని సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. – సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 ( నమస్తే తెలంగాణ ):

# దుద్యాల మండలానికి సీఎం వరాలు

- హకీంపేటకు జూనియర్ కళాశాల, ఐటీఐ, పీహెచ్‌సీ మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 15 : కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాలు కురిపించారు. మండలంలోని హకీంపేట గ్రామానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఐటీఐలను మంజూరు చేశారు. ఈమేరకు ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దుద్యాల మండలంలోని 33 వేల జనాభాకు వైద్య సేవలు అందించడానికి హకీంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేశారు. దీని నిర్మాణానికి రూ.2.40కోట్ల నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా హకీంపేట గ్రామానికి ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. సమీకృత విద్యా సంస్థల ఏర్పాటులో భాగంగా 8వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉండేలా కళాశాలను మంజూరు చేశారు. వీటితో పాటు ప్రభుత్వ ఐటీఐని కూడా హకీంపేట గ్రామానికి మంజూరు చేశారు. ఐటీఐలో రెండేండ్ల వ్యవధి గల ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్ ట్రేడులను మంజూరు చేశారు. ఒక్కో ట్రేడులో 40 మంది విద్యార్థులను చేర్చుకుంటారు. ఐటీఐ కళాశాలకు 22 పోస్టులను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. రెగ్యులర్ పోస్టుల్లో ప్రిన్సిపాల్ ఒకటి, ట్రేనింగ్ ఆఫీసర్ ఒకటి, డిప్యూటీ ట్రేనింగ్ ఆఫీసర్లు 5, డిప్యూటీ ట్రేనింగ్ ఆఫీసర్(ఎంసీడీ) ఒకటి, అసిస్టెంట్ ట్రేనింగ్ ఆఫీసర్లు 5, ఒక సూపరింటెండెంట్, ఒక సీనియర్ అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిలో మూడు సబార్డినేట్, రెండు వాచ్‌మన్ పోస్టులను మంజూరు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

### ప్రజలను మోసం చేయడానికే అభివృద్ధి పనులు



**బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు సురేశ్‌రాజ్**

దుద్యాల మండలంలోని ఫార్మా బాధిత రైతులను మోసం చేయడానికే సీఎం రేవంత్‌రెడ్డి హకీంపేట గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఐటీఐ, జూనియర్ కళాశాలను మంజూరు చేశారని బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు భోగమోని సురేశ్‌రాజ్ విమర్శించారు. ఆదివారం ఆయన దుద్యాల మండలంలోని లగచెర్లలో విలేకరులతో మాట్లాడుతూ.. దుద్యాల మండలంలోని లగచెర్ల, హకీంపేట, పోలేపల్లి, పులిచెర్లకుంటతండా, రోటిబండ తండాల పరిధిలో ప్రభుత్వం ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మాకు వ్యతిరేకంగా రైతులు ఆందోళనలు, దీక్షలు చేస్తున్నారని.. రైతుల దృష్టి మళ్లించడానికే ప్రభుత్వం వీటిని హకీంపేట గ్రామానికి మంజూరు చేసిందన్నారు. అభివృద్ధికి తాము ఎక్కడా వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో కాలుష్యకారక ఫార్మాను ఏర్పాటు చేయడాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నామన్నారు. బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండల కేంద్రాలకు మంజూరు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కనీస వసతులు లేవని.. వాటిలో వసతుల కల్పనపై అధికారులు దృష్టి పెట్టాలని సురేశ్ డిమాండ్ చేశారు.



కరౌకే సంగీతానికి 1992 నుంచి ప్రాచుర్యం తీసుకువస్తూ.. హైదరాబాద్‌లో 29 కరౌకే మ్యూజికల్ నైట్‌లను పూర్తి చేసి 2019లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్న ప్రఖ్యాత కరౌకే గాయకుడు డాక్టర్ గౌస్ హైదర్ ఇటీవల ఏషియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాడిసన్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ బుద్ధ పీస్ పురస్కారాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు.
(తెలుగు యూనివర్సిటీ)

### 22న రాఘవాచారి సంపాదకీయాలపై సమాలోచన

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రముఖ పాత్రికేయుడు, మాజీ సంపాదకుడు దివంగత సి.రాఘవాచారి సంపాదకీయాలలో 3వ సంపుటి 'రాజ్యాంగం- న్యాయస్థానాలు -చట్టసభలు'పై ఈ నెల 22న సమాలోచన సమావేశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్ఆర్ఆర్ సెంటర్‌లో ఆదివారం ఉదయం పదిన్నరకు జరుగనున్న ఈ కార్యక్రమంలో కేంద్ర సమాచార శాఖ పూర్వ ప్రధానకార్యదర్శి మాడభూషి శ్రీధర్, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావు, ఎన్ఆర్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొంటారని, ఆహుతులు సకాలంలో హాజరుకావాలని రాఘవాచారి ట్రస్ట్ కోరింది.

### 19 నుంచి సంగీత, నృత్య పోటీలు



49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి, విజయకుమార్, తదితరులు

తెలుగు యూనివర్సిటీ, సెప్టెంబర్ 15 : నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో సంగీత నాటక అకాడమీ, వైఎంసీఏ నారాయణగూడ సౌజన్యంతో 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీలు ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు, 26న బహుమతుల ప్రదానం ఉంటుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కేవీ రమణాచారి వెల్లడించారు. నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని నఫీఫ్ రెసిడెన్సీలో గల రమణాచారి క్యాంపు కార్యాలయంలో ఆదివారం 49వ అఖిల భారత సంగీత, నృత్య పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి 384 మంది కళాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నానని తెలిపారు. జాతీయ సమగ్రతను ప్రోత్సహించడం, భారతీయ లలిత కళలను వ్యాప్తి చేయాలనే లక్ష్యంతో గత 48 సంవత్సరాలుగా పోటీలు నిర్వహిస్తూ ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తున్నట్లు నవ్యనాటక సమితి అధ్యక్షుడు వి.విజయకుమార్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులతోపాటు మధ్యప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, బీహార్ కళాకారులు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. 19న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ పోటీలను ప్రారంభిస్తారని, ఈ నెల 20 నుంచి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నృత్య కళల పోటీలు, సుల్తాన్ బజార్‌లో గల శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆడిటోరియంలో సంగీత పోటీలు జరుగుతాయని వివరించారు. తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో 26న ముగింపు సభలో గురువులకు, కళాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు పంపిణీ చేస్తామన్నారు.



రైతు వేసిన మొక్కజొన్న పంట


## కంపెనీపై చర్యలు తీసుకోవాలి

**నకిలీ విత్తనాలతో మొక్కజొన్న పంటను నష్టపోయిన రైతు**

నవాబుపేట, సెప్టెంబర్ 15 : చిట్టిగిద్ద గ్రామానికి చెందిన బక్కని నర్సింహులు ఎప్పటిలాగే తనకున్న పొలంలో మొక్కజొన్న పంటను వేశాడు. అయితే సరిగా కాపు కాయకపోవడంతో తీవ్రంగా నష్టపోయాడు. నర్సింహులు వికారాబాద్‌లోని ఓ ఫెర్టిలైజర్ దుకాణంలో సీ.పీ 858 హైబ్రీడ్ మైజ్ సీడ్స్ కంపెనీ అమ్మిన విత్తనాలను నర్సింహులు కొని తన పొలంలో విత్తుకున్నాడు. పంట సరిగా పెరగకపోవడంతోపాటు మొక్కకు సైతం కంకులు రాకపోవడంతో కంపెనీని సంప్రదించాడు. కంపెనీ ప్రతినిధులు పొలం వద్దకు వచ్చి చూసి మొక్కకు బుట్టలు వచ్చాక మళ్లీ వస్తామని చెప్పి రాలేదు. వారికి ఫోన్ చేస్తే కూడా స్పందించడంలేదన్నారు. తనకు జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం కంపెనీపై చట్టరీత్యా చర్యలు తీసుకొని నష్ట పరిహారం అందేలా చూడాలని రైతు కోరుతున్నాడు.



మొక్కజొన్న కంకులతో బాధితుడు నర్సింహులు





రైతు కొనుగోలు చేసిన ఫెర్టిలైజర్ రశీదు

## బిర్యానీ లెగ్‌పీస్‌కు కోడి ఈకలు

**ప్రశ్నించినందుకు నిర్వాహకుల ఎదురుదాడి**

**అధికారులకు ఫిర్యాదు చేసిన కస్టమర్**



వనస్థలిపురం, సెప్టెంబర్ 15 : ఎంతో ఇష్టంతో బిర్యానీ ఆర్డర్‌చేసి లెగ్ పీస్ తిందామని చూడగా.. దానికి కోడి ఈకలు ఉండడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. నిర్వాహకులను ప్రశ్నించగా ఎదురుదాడికి దిగారు. దీంతో వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన వనస్థలిపురంలో చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. హయత్‌నగర్‌కు చెందిన మేఘన తన సోదరుడితో కలిసి బిర్యానీ తినేందుకు సచివాలయనగర్‌లోని అతిథి రెస్టారెంట్‌కు వచ్చింది. బిర్యానీ ఆర్డర్ ఇచ్చి తినేందుకు సిద్ధమవ్వగా లెగ్ పీస్‌కు కోడి ఈకలు ఉన్నాయి. ఇదేమిటని ప్రశ్నించగా నిర్వాహకులు ఎదురు దాడి చేయడంతోపాటు దుర్భాషలాడారు. దీంతో బాధితులు జీహెచ్‌ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు.





నవరాత్రులు, వరుస సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలోని మొజాంజాహి మార్కెట్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ జాం

### గురువులకు కంకణధారణ మహోత్సవం




ఏళేశ్వరపు చలపతి శాస్త్రిని గురురత్న అవార్డుతో సత్కరిస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా, డా.సుబ్రహ్మణ్యం తదితరులు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 15: 'జై జవాన్ – జై కిసాన్ – జై కళాకార్' ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాలను పురస్కరించుకొని గురువులకు కంకణ ధారణ కార్యక్రమాన్ని రవీంద్రభారతిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకుడు లయన్ కేవీ రమణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పూర్వ పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా, డా.సుబ్రహ్మణ్యం (ఐఏఎస్–రి)లు విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పలువురు గురువులకు కంకణధారణ చేశారు. సభకు ముందు పలువురు విద్యార్థులు దేశభక్తి గీతాలు, కూచిపూడి, భరతనాట్యం శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో నాట్య గురువు పశుమర్తి శేషు బాబు, సుధాకర్, ఎం.అనిల్ గౌడ్, డా.ఏళేశ్వరపు చలపతి శాస్త్రి, దివ్యవాణి, వంశీ కృష్ణ పాల్గొన్నారు.

### ఆన్‌లైన్‌లో ఉచిత సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ కోర్సులకు శిక్షణ

కాచిగూడ, సెప్టెంబర్ 15 : కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో లక్ష మంది విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ కోర్సులకు తెలంగాణవ్యాప్తంగా ఉచిత ఆన్‌లైన్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ స్కిల్ అకాడమీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ సాయి శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. కాచిగూడలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన 100కు పైగా అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సులు, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, డేటాసైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వన్నుట్లు తెలిపారు. కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు దేశ, విదేశాల్లో విస్తృతమైన ఉపాధి అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిపొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు ఆన్‌లైన్‌లో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నం. 95058 00050, www.nationalskillacademy.inలో సంప్రదించవచ్చని కోరారు.

### ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌లో పాలీ హెల్త్ క్లినిక్ ప్రారంభం




సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ)/ఎల్బీనగర్ : దేశంలోనే మొట్టమొదటిసారిగా హైదరాబాద్ మెట్రో స్టేషన్లలో ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయమని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. మిట్టా ఎక్స్‌లెన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీ నగర్ మెట్రో స్టేషన్‌లో పాలీ హెల్త్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది. ఇందుకు ముఖ్య అతిథిగా వచ్చిన మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. మెట్రో ప్రయాణికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు కూడా ఈ వైద్య సేవలను వినియోగించుకోవచ్చని ఆమె తెలిపారు. మొదటిసారిగా హెల్త్ ఏటీఎం కూడా అందుబాటులోకి వచ్చిందన్నారు. రక్త పరీక్షల డయాగ్నస్టిక్స్ సౌకర్యం, మెడికల్ షాప్, వైద్య నిపుణులు, ఫిజియోథెరపీ, టెలీ మెడిసిన్, డెంటల్ కేర్ ఇలా అన్నీ మెట్రోస్టేషన్‌లో అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ సందర్భంగా ముసారాంబాగ్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్‌బీ నగర్ మెట్రోస్టేషన్ వరకు మెట్రో ట్రైన్‌లో మేయర్ పర్యటించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మిట్టా ఎక్స్‌లెన్స్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్లు నిఖిల్‌కుమార్‌రెడ్డి, నిఖితారెడ్డి పాల్గొన్నారు.

### కోమటిరెడ్డి రాజీనామా చేయాలి



రాజు నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 15: మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుపై మతిభ్రమించి మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే రాజీనామా చేసి, ముక్కు నేలకు రాయాలని ఓయూ జేఏసీ చైర్మన్, గిరిజన చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ కరాటే రాజునాయక్ డిమాండ్ చేశారు. యాదాద్రి, వేములవాడ ఇతర దేవాలయాలకు మాజీ మంత్రి హరీశ్‌రావు బినామీ డెయిరీల నెయ్యిని వాడుతున్నారని ఆరోపిస్తూ, మదర్ డెయిరీ ఎన్నికల కార్యక్రమంలో పాల్గొని హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోపణలను నిరూపించలేని పక్షంలో మంత్రి పదవికి రాజీనామా చేస్తారా? అని ప్రశ్నించారు. మదర్ డెయిరీ, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారులకు ఏడు నెలలుగా పాల బిల్లుల చెల్లించడం లేదని మండిపడ్డారు. పాల ఉత్పత్తిదారులు తమ పాలనను సీఎం సొంత జిల్లా పాలమూరు జాతీయ రహదారిపై పోసి నిరసన వ్యక్తం చేశారన్నారు.



### ఎస్కీలో ఘనంగా ఇంజినీర్స్ డే

సిటీబ్యూరో, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఇంజినీరింగ్ విద్య మానవ మేథస్సుకు సవాలుగా మారుతుందని, ప్రపంచంలోని అద్భుతాలన్నీ ఇంజినీరింగ్ టెక్నాలజీతోనే సాధ్యమైనట్లుగా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జి.రామేశ్వర్‌రావు అన్నారు. సెప్టెంబర్ 15న ఎస్కీలో ఇంజనీర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. కాలేజీ ఆవరణలోని ప్రముఖ ఇంజనీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం, జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యలో సుమారు 15 విభాగాలు పనిచేస్తున్నాయని, స్పేస్ టెక్నాలజీ, సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ తదితర విభాగాల ద్వారా ప్రపంచం మొత్తంలో ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుండటం వలన ప్రపంచం ఒక అత్యద్భుత ప్రగతిని సాధించిందన్నారు. భవిష్యత్తులో మరింత వేగం పుంజుకుంటుందని డా. రామేశ్వర్ రావు అన్నారు. 1981లో ఎస్కీని స్థాపించడం జరిగిందని, దక్షిణాసియాలోనే ఉన్న ఏకైక సంస్థలో 40 ఏండ్లుగా వేలాది మంది అభ్యర్థులకు ఇంజనీరింగ్‌కు సంబంధించిన విద్యలో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో పలువురు ఇంజనీరింగ్ డాక్టరేట్లు, డా. కృష్ణప్రసాద్ రావు, డా. విద్యాసాగర్, డా. ప్రశాంత్, డా. ఏ.జగన్ మోహన్ రెడ్డి, డా. శ్రీధర్, డా. ఆదినారాయణ, డా. చంద్రకళ, లక్ష్మీకాంతారావు పలువురు పాల్గొన్నారు.